# వేర్వేరు సమయాల్లో, వేర్వేరు ప్రశ్నపత్రాలతో..

- గ్రూప్స్ స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించనున్న ఏపీపీఎస్సీ
- ఏపీపీఎస్సీ ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం
- ఆన్‌లైన్ పరీక్షా కేంద్రాలు తక్కువగా ఉన్నందునేనని కమిషన్ వివరణ
- కొత్త విధానంపై వెల్లువెత్తుతున్న విమర్శలు
- ఇది అశాస్త్రీయం అంటున్న నిపుణులు



సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) పరిధిలోని గ్రూప్-1తో సహా వివిధ గ్రూప్స్ పోస్టుల భర్తీకి ప్రవేశపెడుతున్న ప్రిలిమ్స్(స్క్రీనింగ్ టెస్ట్)ను వేర్వేరు సమయాల్లో వేర్వేరు ప్రశ్నపత్రాలతో నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏపీపీఎస్సీకి అనుమతిస్తూ ప్రభుత్వ సాధారణ పరిపాలనా విభాగం సోమవారం జీవో విడుదల చేసింది. లక్షలాది మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరయ్యే అవకాశమున్నందున వారి నుంచి మెరిట్ అభ్యర్థులను ఎంపిక చేయడానికి అన్ని గ్రూప్స్‌లలోనూ స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించాలని ఏపీపీఎస్సీ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ స్క్రీనింగ్ టెస్ట్‌ను ఆన్‌లైన్ ద్వారా చేపట్టేందుకు ప్రభుత్వం ఇదివరకు అనుమతిచ్చింది. అయితే, గ్రూప్స్ పరీక్షలకు అభ్యర్థులు లక్షల్లో హాజరవుతుంటారు. వారిందరికీ ఒకేసారి పరీక్ష నిర్వహించడంలో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. దీన్ని నివారించేందుకు అన్ని గ్రూప్స్‌లలో ముందుగా ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి, అర్హత సాధించిన వారికి మెయిన్స్ నిర్వహించాలని కమిషన్ నిర్ణయించింది. మెయిన్స్‌లో మెరిట్ సాధించిన వారిని పోస్టులకు ఎంపిక చేయనున్నారు. కానీ స్క్రీనింగ్ టెస్ట్‌లు నిర్వహించేందుకు ఆన్‌లైన్ పరీక్ష కేంద్రాలు పరిమితంగా ఉన్నాయి. అందువల్ల ఈ టెస్ట్‌ను వేర్వేరు సమయాల్లో(మల్టీ సెషన్లు), వేర్వేరు ప్రశ్నపత్రాల(మల్టీ క్వశ్చన్ పేపర్లు)తో నిర్వహించాలని ఏపీపీఎస్సీ ప్రతిపాదించింది. ఆయా పోస్టులకు వచ్చే దరఖాస్తులు 25వేలు దాటితే.. స్క్రీనింగ్ టెస్ట్‌ను మల్టీ సెషన్ల కింద వేర్వేరు ప్రశ్న పత్రాలతో నిర్వహించనున్నారు. కాగా, గ్రూప్-1లో ఇదివరకే ప్రిలిమ్స్ ఉన్నందున దీంతో పాటు గ్రూప్-2, గ్రూప్-3లలో కూడా ప్రిలిమ్స్(స్క్రీనింగ్ టెస్ట్)ను వేర్వేరు సమయాల్లో, వేర్వేరు ప్రశ్నపత్రాలతో నిర్వహించడానికి వీలుగా ఏపీపీఎస్సీ ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదించింది.

**కొత్త విధానంపై విమర్శలు**

ఇలా ఉండగా గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షలలో స్క్రీనింగ్ టెస్ట్‌ను వేర్వేరు సమయాల్లో వేర్వేరు ప్రశ్నపత్రాలతో నిర్వహించే ఏపీపీఎస్సీ కొత్త విధానంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అభ్యర్థుల సంఖ్య 25 వేలు దాటిన తర్వాతి నుంచి ప్రశ్నపత్రాలు మారతాయి. ఆ తదుపరి అభ్యర్థులు వేరే ప్రశ్నపత్రాలతో పరీక్ష రాయాల్సి ఉంటుంది. ఎన్ని సెషన్ల పాటు పరీక్ష జరిగితే అన్ని ప్రశ్నపత్రాలు మారుతాయి. ఒక పోటీ పరీక్షను వేర్వేరు ప్రశ్నపత్రాలతో నిర్వహించి అభ్యర్థుల సామర్థ్యాన్ని ఒకేరకంగా అంచనా వేయడం సాధ్యమయ్యేది కాదని, ఇది అశాస్త్రీయమని నిపుణులు పేర్కొంటున్నారు. ఆర్ఆర్‌బీ తదితర పరీక్షల మాదిరిగా ఏపీపీఎస్సీ పరీక్షలు ఉండవని గుర్తుచేస్తున్నారు. ఆ పరీక్షలు లాజికల్ రీజనింగ్, మెంటల్ ఎబిలిటీతో కూడి ఉంటాయని, కానీ గ్రూప్స్ పరీక్షలు జనరల్ స్టడీస్‌కు సంబంధించినవని పేర్కొంటున్నారు. ఒకే పరీక్షను వేర్వేరు సమయాల్లో వేర్వేరు ప్రశ్నపత్రాలతో నిర్వహించడం కుదరదని.. ఒకే పరీక్ష నిర్వహించాలని 2011 గ్రూప్-1 కేసులో సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని గుర్తు చేస్తున్నారు. సుప్రీం తీర్పుతో ప్రస్తుతం 2011 గ్రూప్-1 మెయిన్స్‌ను మళ్లీ నిర్వహించనున్న ఏపీపీఎస్సీ.. స్క్రీనింగ్ టెస్టులను మాత్రం వేర్వేరు సమయాల్లో, వేర్వేరు ప్రశ్నపత్రాలతో నిర్వహిస్తామనడం సరికాదంటున్నారు.

**ఆన్‌లైన్ పరీక్షా కేంద్రాలు పరిమితంగా ఉన్నందునే..**

ఈ విమర్శలను కమిషన్ కార్యదర్శి గిరిధర్ దృష్టికి తీసుకెళ్లగా.. రాష్ట్రంలో ఆన్‌లైన్ పరీక్షా కేంద్రాలు పరిమితంగా ఉండడం, అభ్యర్థులు లక్షల్లో ఉంటారన్న అంచనాలతో ఈ మల్టీ సెషన్, మల్టీ క్వశ్చన్ పేపర్ల పద్ధతిని పాటించాలని భావిస్తున్నట్లు వివరించారు. విధివిధానాల రూపకల్పనకు డీఓపీటీతో సహా వివిధ సంస్థలతో చర్చించామని వివరించారు. మాస్ కాపీయింగ్, లీకేజీ వంటి అనేక ఇబ్బందులు అధిగమించి మెరిట్ అభ్యర్థులకు న్యాయం చేసేందుకే ఈ విధానాన్ని అనుసరిస్తున్నామని వివరించారు.